సాక్షి రంగారెడ్డి
బుధవారం ￭ 12 ￭ ఫిబ్రవరి ￭ 2025



ప్రమాద 'సాగరం'
హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు హడలి పోతున్నారు. 8లో▶



కల్తీ అల్లం వెల్లుల్లి గుట్టురట్టు
కల్తీ అల్లం వెల్లుల్లి మిశ్రమాన్ని తయారు చేస్తున్న కేంద్రంపై మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. 8లో▶



చేపల వేటకు వెళ్లి..
బతుకుదెరువు కోసం చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో నీటమునిగి మృతి చెందాడు. ఈ ఘటన ఇన్ముల్ నర్వలో జరిగింది. 8లో▶

న్యూస్‌రీల్

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

కందుకూరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం అసెంబ్లీ ఇన్‌చార్జి, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి గంగాపురం వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బూత్ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేసి గెలుపు దిశగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైన ఉందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎ.అశోక్‌గౌడ్, సీనియర్ నాయకులు జి.రాజేందర్‌రెడ్డి, పి.భిక్షపతి, ఎ.సత్తయ్య, ఎస్.నరసింహారెడ్డి, మంద పాండు, బి.దిలీప్‌గౌడ్, మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ గౌర పర్వతాలు, నాయకులు దార కుమార్, ఎస్.వెంకటేశ్, ఎస్.భూమిరెడ్డి, రఘునందన్, రవీందర్‌గౌడ్, ఎ.నారాయణ, ప్రవీణ్, సురేష్, మల్లేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు

సరూర్‌నగర్ కాంప్లెక్స్ ఖాళీ



కాంప్లెక్స్‌ను సీజ్ చేసిన అధికారులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్ డీఎస్పీ జానకిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఖాళీ చేయించారు. ఈ భవన సముదాయాన్ని హెచ్‌ఎండీఏ 1981లో నిర్మించింది. అప్పటి నుంచి 2008 వరకు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు లీజుకు ఇచ్చారు. 2008లో లీజు గడువు ముగిసింది. భవనంపునాదుల నుంచి పూర్తిగా బలహీనంగా ఉన్నందున, నాసిరకం కాంక్రీట్ నిర్మాణం దృష్ట్యా యథాతథంగా కొనసాగించడం సాధ్యం కాదని ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం హెచ్‌ఎండీఏకు నివేదిక అందజేసింది. ఈ మేరకు అధికారులు షాపుల నిర్వాహకులను ఖాళీ చేయాలంటూ నోటీసులు ఇచ్చారు. అయినప్పటికీ కొందరు అందుకు నిరాకరించి హైకోర్టును ఆశ్రయించారు. వారికి హైకోర్టులో చుక్కెదురైంది. దీంతో వ్యాపారులు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రత దృష్ట్యా కాంప్లెక్స్‌ను ఖాళీ చేయించేందుకు హెచ్‌ఎండీఏ ఉపక్రమించింది. ఈ మేరకు మంగళవారం భారీ పోలీసులు బందోబస్తు మధ్య అధికారులు ఖాళీ చేయించారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

మంచాల: గ్రామాల్లో మొక్కల పెంపకం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అన్నారు. మండలంలోని నోముల గ్రామంలో నర్సరీని మంగళవారం పరిశీలించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మొక్కలకు నీళ్లు అందించాలని, మొక్కల మధ్య కలుపు లేకుండా చూడాలని సూచించారు. ప్రతి గ్రామంలో లక్ష్యానికి తగ్గకుండా మొక్కలు పెంచాలన్నారు. గ్రామాల్లో రైతులకు అవసరమైన మొక్కలు ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలన్నారు. నర్సరీల నిర్వహణలో లోపాలుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో మొక్కలు చనిపోకుండా చూసుకోవాలన్నారు. పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న పశువుల షెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ వీరాంజనేయులు, ఈసీ విమల, ఎస్ఆర్ ఈజీఎస్ సిబ్బంది సక్కు బాయి, మహేశ్, రుక్మిణి, పంచాయతీ కార్యదర్శి సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్తవి లేవు

మున్సిపాలిటీల్లో తగ్గిన భవన నిర్మాణాలు

- 2021-22లో అనుమతులు పొందినవి 11,644
- 2022-23లో 10,800కు చేరిన సంఖ్య
- 2023-24లో 6,949 పడిపోయిన వైనం
- తగ్గిన నూతన నిర్మాణాలు.. అమ్ముడుపోని పాత భవనాలు
- గణనీయంగా పడిపోతున్న ఆదాయం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వరుస ఎన్నికలు, ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక సంక్షోభం.. స్టీలు, సిమెంట్, ఇటుక, ఇసుక, కంకర, ఇతర ముడిసరుకు ధరలు విపరీతంగా పెరగడం.. కూలీ రేట్లు రెట్టింపు కావడం.. వెరసి నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. నగరానికి ఆనుకుని ఉన్న కీలక మున్సిపాలిటీల్లో ఏటా కొత్త నిర్మాణాల సంఖ్య పెరగకపోగా మరింత తగ్గుముఖం పట్టడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉండగా, వీటిలో 2021–22లో 11,644 నిర్మాణాలకు అనుమతులు జారీ చేయగా, అదే 2022–23లో వాటి సంఖ్య 10,800 తగ్గింది. తాజాగా 2023–24లో 6,949 నిర్మాణాలకు మాత్రమే అనుమతులు జారీ కావడం గమనార్హం. నిర్మాణ అనుమతుల జారీ ద్వారా ఏటా రూ.కోట్ల ఆదాయం మున్సిపాలిటీలకు సమకూరేది. ప్రస్తుతం నిర్మాణాల సంఖ్య తగ్గడంతో అనుమతులు, ఆస్తిపన్ను రూపంలో వచ్చే రాబడి గణనీయంగా పడిపోయినట్లు తెలిసింది.

వెనుకాడుతున్న బిల్డర్లు

భవన నిర్మాణాల అనుమతుల జారీలో బడంగ్‌పేట్, తుర్కయంజాల్, బండ్లగూడ జాగీర్, నార్సింగి, మణికొండ, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలు గతంలో ముందు వరుసలో నిలిచాయి. ఇక్కడ రెండేళ్ల క్రితం వరకు నిర్మాణాలు ఊపందుకున్నాయి. అనేక మంది సొంతంగా ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు వచ్చారు. అపార్ట్‌మెంట్లలోని ప్లాట్లు మాత్రమే కాదు వ్యక్తిగత నివాసాల అమ్మకాలు భారీగా తగ్గిపోవడం, పెరిగిన ధరల కారణంగా బిల్డర్లు సైతం నిర్మాణాలకు వెనుకాడుతున్నారు. గతంలో ఇక్కడ ఏటా రెండు మూడు ప్రాజెక్టులు పూర్తి చేసిన వారు సైతం.. తాజాగా ఒకటి కూడా చేయడం లేదు. ఇప్పటికే పూర్తి చేసుకున్న బహుళ అంతస్తుల భవనాల్లోని ప్లాట్లు అమ్ముడుపోక, అలాగే ఉండి పోవడంతో కొత్త నిర్మాణాల జోలికి వారు వెళ్లడం లేదు.

అడ్డగోలుగా నిర్మాణాలు

సాధారణంగా భవన నిర్మాణ అనుమతుల కోసం నిర్మాణదారులు టీఎస్ బిపాస్ ద్వారా ఆయా మున్సిపాలిటీలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. సేల్‌డీడ్, ఆర్కిటెక్చర్ తయారూ చేసిన బిల్డింగ్ ప్లాన్ కాపీ, ఎల్ఆర్ఎస్ సర్టిఫికెట్‌లను పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తుంటారు. ఆయా మున్సిపాలిటీల టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అన్ని సవ్యంగా ఉన్నట్లు నిర్ధారించుకుని అనుమతులు జారీ చేస్తుంటారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే చిన్నచిన్న సాంకేతిక అం



శాలను సాకుగా చూపించి నిర్మాణ దరఖాస్తులను రిజెక్ట్ చేస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. శంషాబాద్, తుక్కుగూడ, పెద్ద అంబర్‌పేట్, ఆదిబట్ల మున్సిపాలిటీల పరిధిలో భారీగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, చర్యలు తీసుకోవాల్సిన టీపీఓలు అక్రమార్జనకు పాల్పడుతూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వివిధ మున్సిపాలిటీల పరిధిలో అనుమతులు ఇలా..

మున్సిపాలిటీ	2021-22	2022-23	2023-24
ఆదిబట్ల	141	192	294
ఆమనగల్లు	68	70	65
బడంగ్‌పేట్	3,335	3,605	1,320
బండ్లగూడజాగీర్	1,248	1,321	1,147
ఇబ్రహీంపట్నం	240	166	110
జల్‌పల్లి	97	166	116
కొత్తూరు	34	31	24
మణికొండ	86	843	263
మీర్‌పేట్	1,119	358	388
నార్సింగి	152	186	193
పెద్ద అంబర్‌పేట్	245	1,097	790
షాద్‌నగర్	697	609	250
శంషాబాద్	24	74	43
శంకర్‌పల్లి	367	343	212
తుక్కుగూడ	168	112	114
తుర్కయంజాల్	363	1,627	1,620

ఇంటింటికీ ఇంటర్‌నెట్ సేవలు

టీ ఫైబర్ గ్రిడ్ రాష్ట్ర చైర్మన్ వేణుప్రసాద్



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో ఇంటింటికీ ఇంటర్‌నెట్ సేవలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని టీ ఫైబర్ గ్రిడ్ రాష్ట్ర చైర్మన్ వేణు ప్రసాద్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి టీ ఫైబర్ గ్రిడ్ (ఇంటర్‌నెట్) కనెక్షన్లను ఇంటింటికీ ఇస్తున్నారు. సేవలు ఏ విధంగా అందుతున్నాయి, ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతోంది అనే విషయాలను తెలుసుకునేందుకు మంగళవారం ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడారు. గ్రామంలో టీ ఫైబర్ గ్రిడ్‌ద్వారా ఇంటర్‌నెట్ సేవలు పొందుతున్న వినియోగదారులను కలిసి మాట్లాడారు. అనంతరం వేణుప్రసాద్ మాట్లాడుతూ.. భారత్‌నెట్ కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు తెలంగాణలోని ప్రతి ఇంటికీ ఇంటర్‌నెట్ సేవలను అందించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలోని పెద్దపల్లి, నారాయణపేట, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్టు వెల్లడించారు. హాజిపల్లిలో మొత్తం 274 ఇళ్లు ఉన్నాయని, ఇప్పటి వరకు 80 ఇళ్లకు ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మూడు నెలల పాటు ఇంటర్‌నెట్ సేవలను ఉచితంగా అందించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ప్రపంచబ్యాంకు ప్రతినిధులు కింబెర్లీజాన్స్, సియోసాంజీఎన్లీ, ఇషామెహతా, అరుణ్‌శర్మ, డీపీఓ సురేష్ మోహన్, ఎంపీడీఓ బన్సీలాల్, ఎంపీఓ జయంత్‌రెడ్డి, హాజిపల్లి ప్రత్యేకాధికారి కరుణశ్రీ, పంచాయతీ కార్యదర్శి హన్మంత్‌రెడ్డి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో జాగ్రత్త



ఇంటర్‌నెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎన్ఐసీ డీఐఓ స్వర్ణలత

ఇబ్రహీంపట్నం రూరల్: సైబర్ మోసాలకు గురికావొద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ తెలిపారు. సురక్షిత ఇంటర్‌నెట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఐసీ (నేషనల్ ఇంఫార్మాటిక్ సెంటర్) డీఐఓ జి.స్వర్ణలత ఆధ్వర్యంలో సురక్షిత ఇంటర్‌నెట్‌పై హాజీపల్లి పంచాయతీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీపీఓ సురేష్ మోహన్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇంటర్‌నెట్‌ను సురక్షితంగా ఉపయోగించుకునే మార్గాలను ఎంచుకోవాలన్నారు. హ్యాకింగ్ ఫిషింగ్ మాల్వేర్ దాడులను తగ్గించేందుకు సురక్షిత డిజిటల్ ప్రవర్తన అలవర్చుకోవాలని సూచించారు. ఇంటర్‌నెట్ వినియోగంలో జాగ్రత్తలు, బలమైన పాస్‌వర్డ్ ఉపయోగం, ద్విపాత్రిక ధ్రువీకరణ, సురక్షితమైన వెబ్ బ్రౌజింగ్, సైబర్ నేరాల నివేదిక విధానాల గురించి స్వర్ణలత వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

'ఫ్యూచర్'కు బాటలు !



- ఫోర్త్ సిటీకి ప్రత్యేక అథారిటీ
- 71 పంచాయతీలతో ప్రతిపాదనలు
- గ్రీన్‌ఫీల్డ్ రహదారికిరువైపులా ఉన్న గ్రామాల విలీనం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఫ్యూచర్ సిటీకి బాటలు పడుతున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ రహదారికి శరవేగంగా భూసేకరణ ప్రక్రియ నిర్వహిస్తున్న సర్కారు.. తాజాగా ప్రత్యేక ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడం ద్వారా ప్రపంచస్థాయి నగరాల సరసన ఫోర్త్‌సిటీని నిలబెట్టాలని నిర్ణయించింది. నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్సీఆర్), గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహాలో ఈ ప్రాధికార సంస్థ కార్యాచరణ, విధివిధానాలు ఉండేలా కసరత్తు చేస్తోంది.

ప్రాథమిక నివేదికకు రూపకల్పన

కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా ఏర్పాట్లు చేస్తున్న ఈ పట్టణాభివృద్ధి సంస్థ (యూడీఏ) పరిధిలో కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, యాచారం, కడ్తాల్ మండలాలను తేవాలని యోచిస్తోంది. ఔటర్ రింగ్‌రోడ్డు రావిరాల జంక్షన్ నుంచి ఆకుతోటపల్లి వరకు ప్రతిపాదించిన 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రామాలను దీని పరిధిలో చేర్చనుంది. ఈ మేరకు కసరత్తు మొదలుపెట్టిన జిల్లా యంత్రాంగం మంగళవారం ప్రాథమిక నివేదికను రూపొందించింది.

యూడీఏలో ఉండేలా..

నాగార్జునసాగర్, బెంగళూరు హైవేలు, ఇటు ఔటర్ రింగ్‌రోడ్డు, మరోవైపు ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు లోపలి గ్రామాలను ఈ అథారిటీ పరిధిలోకి తెచ్చేలా ప్రతిపాదనలు తయారు చేసింది. 71 పంచాయతీలతో మీర్‌ఖాన్‌పేట పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. మహేశ్వరం, కందుకూరు మండలాలను పూర్తిస్థాయిలో యాచారం, ఇబ్రహీంపట్నం మండలాల్లో సాగర్ రహదారి లోపలి పంచాయతీలు.. కడ్తాల్ మండలంలో గ్రీన్‌ఫీల్డ్ రహదారి చేరువలోని గ్రామాలను యూడీఏలో ఉండేలా ప్రతిపాదనలు రూపొందించింది. నివేదికకు తుదిరూపునిచ్చి ప్రభుత్వ పరిశీలనకు పంపనుంది.

ఇబ్బందులు రాకుండా..

30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్‌సిటీని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే సేకరించిన 13,973 ఎకరాలకుతోడు మరో 16 వేల ఎకరాలను ల్యాండ్‌పూలింగ్ ద్వారా సమీకరించాలని యోచిస్తోంది. ఫోర్త్‌సిటీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సర్కారు.. ఐటీ, పారాశ్రామిక, ఆతిథ్య, పర్యాటక, క్రీడారంగాలకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. కృతిమ మేధ (ఏఐ) సిటీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అత్యాధునిక వాణిజ్య భవనం సహా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, క్రికెట్ స్టేడియం తదితర ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు ఇందులో చోటు కల్పించాలని యోచిస్తోంది. ప్రతిబంధకాలు రాకుండా, అభివృద్ధి పనులు ప్రణాళికబద్ధంగా సాగేలా ప్రత్యేకంగా అథారిటీ ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. అలాగే ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ రూపొందించనుంది. దీనికి అనుగుణంగా ల్యాండ్ యూజ్ జోన్లను నిర్దేశించనుంది.



రంగరాజన్‌తో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు



రంగరాజన్‌ను పరామర్శిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తదితరులు

అరాచకాలను సహించేది లేదు

అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

మొయినాబాద్: రామరాజ్యం పేరుతో అరాచకాలు సాగిస్తే సహించేది లేదని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ హన్మంతరావుతో కలిసి మంగళవారం చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చిన ఆయన అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేవుని సేవ చేసే అర్చకుడు రంగరాజన్‌పై దాడి అమానవీయ ఘటనగా అభివర్ణించారు. దాడి చేసిన నిందితుల్లో కొందరిని ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారని, మిగతా వారిని సైతం అరెస్టు చేస్తామని చెప్పారు. చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద భద్రత పెంచుతామన్నారు. అంతకు ముందు ప్రధాన అర్చకుడు సౌందరరాజన్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దేవుడిపేరు, రాముడి పేరు చెప్పి దాడులు చేయడం దురదృష్టకరమని మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. రంగరాజన్‌పై జరిగిన దాడిని త్రీవంగా ఖండించారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్ర శర్మ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామరాజ్యం ముసుగులో రౌడీ మూకలు

రామరాజ్యం పేరుతో రౌడీ మూకలు దాడులకు దిగడం దుర్మార్గమైన చర్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద మంగళవారం అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లౌకికవాది, ప్రజాస్వామ్యవాది, పరమత సహనం కలిగిన అర్చకుడు రంగరాజన్ అని.. అలాంటి వ్యక్తిపై మతోన్మాదులు దాడి చేయడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. రంగరాజన్‌ను పరామర్శించిన వారిలో పార్టీ రాష్ట్ర నాయకులు డీజీ నర్సింహారావు, హిమబిందు, శ్రీరాం నాయక్, ఆశయ్య, రమేష్, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యవర్గ సభ్యులు భాస్కర్, సామెల్, జగదీశ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్, నాయకులు దేవేందర్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, అరుణ్‌కుమార్, తేజ, రత్నం, శేఖర్, సంజీవ, సందీప్, అంజి, శ్రీశైలం, రాజేందర్ తదితరులు ఉన్నారు.

మతోన్మాద శక్తులను అరికట్టాలి

మతోన్మాద శక్తులను ప్రభుత్వం అణచివేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. పార్టీ నాయకులతో కలిసి రంగరాజన్‌ను పరామర్శించారు. దాడి చేసిన మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, అంజయ్య, మల్లేష్, రాములు తదితరులు ఉన్నారు.

పరామర్శించిన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్

వికారాబాద్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి రంగరాజన్‌ను పరామర్శించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీంభరత్, మాజీ సర్పంచ్‌లు పురాణం వీరభద్రస్వామి, వెంకట్‌రెడ్డి, నాయకులు కేబుల్ రాజు తదితరులు ఉన్నారు.

ఫార్మా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



మాట్లాడుతున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఫార్మా రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయం ఆవరణలో మంగళవారం యాచారం మండలం నానాక్‌నగర్, మేడిపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాచకొండ సీపీ సుధీర్‌బాబు అనుమతితో ఫార్మా సిటీ ప్రాంతంలో భూములు కోల్పోయిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫార్మా వ్యతిరేక పోరాట సమితి కో ఆర్డినేటర్ సరస్వతి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బలవంతంగా రైతుల భూములు లాక్కుందని.. తాము అధికారంలోకి వస్తే ఫార్మా పేరుతో తీసుకున్న భూములను తిరిగి ఇస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు హామీలిచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం స్పష్టమైన ప్రకటన లేకుండా ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ, ఫార్మా విలేజ్ అంటూ అధికార పార్టీ నేతలు రకరకాలుగా మాట్లాడుతూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. ఏ ప్రాజెక్ట్ పెడుతున్నారో చెప్పకుండా.. గ్రామ సభలు నిర్వహించకుండా.. ప్రజల అభిప్రాయాలను సేకరించకుండా భూసేకరణ చేపట్టడం చట్ట వ్యతిరేకమని ఆమె అభిప్రాయపడ్డారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. ఫార్మా భూములు ధరణి పోర్టల్‌లో లేకపోవడంతో రైతు బంధు, రైతు బీమా, క్రాప్ లోన్స్ రావడం లేదని, అత్యవసర పరిస్థితుల్లో విక్రయించుకుందామన్నా వీలు లేకుండా పోయిందని, మార్టిగేజ్‌లాంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను సాగుచేసుకొని జీవనాధారం పొందుతున్న తమ పట్టా భూములను ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. రైతులు అధైర్యపడొద్దని, కలెక్టర్, సీపీ దృష్టికి తీసుకెళ్తానని డీసీపీ హామీ ఇచ్చారు. ఎలాంటి ఆవేశాలకు లోనుకావద్దని, శాంతియుతంగా ఆందోళనలు చేపట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, ఇబ్రహీంపట్నం, గ్రీన్‌ఫార్మా, యాచారం సీఐలు జగదీశ్, కృష్ణంరాజు, నర్సింహులు, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి.. చెరువులో పడి

- మృతి చెందిన వ్యక్తి
- ఇన్ముల్‌నర్వ గ్రామంలో విషాదం


రాజు (ఫైల్)

కొత్తూరు: బతుకుదెరువు కోసం చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో నీటమునిగి మృతి చెందాడు. ఈ విషాద సంఘటన మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో వెలుగు చూసింది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల మేరకు.. ఫరూఖ్‌నగర్ మండలం మేళ్ల గూడతండా పంచాయతీ పరిధిలోని కాళ్లతండాకు చెందిన రాజు(40) సోమవారం చేపలు పట్టేందుకు జేపీదర్గా సమీపంలోని చెరువు వద్దకు వచ్చాడు. రాత్రయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడి చెరువు వద్దకు చేరుకున్నారు. అక్కడ గట్టుపై రాజుకు సంబంధించిన దుస్తులు, బ్యాగు, చేపల వల కనిపించాయి. అనుమానంతో విషయాన్ని పోలీసులతో పాటు స్థానికులకు తెలియజేశారు. అప్పటికే రాత్రి కావడంతో చెరువులో గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. మంగళవారం ఉదయం పోలీసులు అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో వెతకగా రాజు మృతదేహం లభ్యమైంది. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.


గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్, పోలీసులు

ఫిట్స్‌తో వ్యక్తి మృతి


రమేశ్ (ఫైల్)

చేవెళ్ల: జన్మదిన వేడుకలకు వెళ్లిన ఓ వ్యక్తి ఫిట్స్‌తో కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి అంతారం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జన్మదిన వేడుకలను గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో సోమవారం రాత్రి నిర్వహించారు. వేడుకలకు గ్రామస్తులను ఆహ్వానించటంతో అందరూ వెళ్లారు. ఇందులో బాకారపు రమేశ్(30) ఉన్నాడు. వేడుకలు కొనసాగుతుండగా.. రమేశ్‌కు ఫిట్స్ వచ్చాయి. అతన్ని చేవెళ్ల ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్యకు సమాచారం ఇచ్చారు. ఆమె హాస్పిటల్‌కు వెళ్లగా.. రమేశ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన భర్తకు అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుంటాయని మృతుడి భార్య పోలీసులకు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

కుల్కచర్ల: ఈ నెల 13వ తేదీ నుంచి సేవాలాల్, మరియమ్మయాడి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. చౌడాపూర్ మండలంలోని మక్తవెంకటాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సేవాలాల్, మరియమ్మయాడి ఆలయ ప్రారంభోత్సవ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రమాద ‘సాగరం’

- రక్తసిక్తమవుతున్న హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారి
- ఇబ్రహీంపట్నం–మాల్ మధ్య నిత్యం ప్రమాదాలు
- పెరిగిన వాహనాల రద్దీ.. మితిమీరిన వేగం
- ఫలితాలివ్వని పోలీసుల తనిఖీలు
- ఏడాదిలో 20 మంది మృతి, 250 మందికిపైగా క్షతగాత్రులు


ఇటీవల గునుగల్ గేట్ సమీపంలో క్రూజర్, కారు ఢీకొన్న ఘటనా స్థలం

యాచారం: హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు హడలిపోతున్నారు. ఏ వాహనం వచ్చి ప్రమాదానికి గురి చేస్తుందోనని జంకుతున్నారు. మితిమీరిన వేగానికి తోడు సింగిల్‌లైన్ రహదారి ఉండడంతో నిత్యం ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు మదనపడుతున్నారు. తాజాగా మండల పరిధిలోని గునుగల్‌గేట్ సమీపంలో క్రూజర్–కారు ఢీకొన్న ఘటనలో 12 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదానికి అతివేగం, ఒకే వరుస రహదారే ప్రధాన కారణం. సాగర్ హైవేపై ఏపీలోని మాచర్ల, గుంటూరు, మార్కాపురం, కనిగిరి, చీరాల తదితర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులతో పాటు తెలంగాణలోని నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ ప్రాంతాలకు చెందిన వారు రాకపోకలు సాగిస్తుంటారు.

కొంపముంచుతున్న వేగం

సాగర్ రహదారిపై వాహనాల మితిమీరిన వేగమే ప్రయాణికులను పొట్టన పెట్టుకుంటుంది. సింగల్ రోడ్డు ఉండడం, గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవాలనే ఆత్రుతతో ప్రయాణికులు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. గతేడాదిగా మాల్ చౌరస్తా, తమ్మలోనిగూడగేట్, తక్కళ్లపల్లిగేట్, యాచారం పోలీస్‌స్టేషన్, చౌదర్‌పల్లిగేట్, గునుగల్ అటవీ ప్రాంతం, కృష్ణాజలాల రిజర్వాయర్ గేట్, గునుగల్ తిరుమల డెయిరీ, ఆగాపల్లి గేట్, ఆగాపల్లి స్టోన్ క్రషర్ తదితర చోట్ల జరిగిన ప్రమాదాల్లో సుమారు 20 మందికి పైగా మృత్యువాత పడగా.. 250 మందికి పైగా తీవ్ర గాయాలై ఆస్పత్రుల పాలయ్యారని పోలీసుల గణంకాలు చెబుతున్నాయి. అత్యధికంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సులు, క్రూజర్లు, కార్లు ఢీకొట్టడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

కలగానే రోడ్డు విస్తరణ

వాహనాల రద్దీ, తరచూ ప్రమాదాలతో రక్తసిక్తమవుతున్న సాగర్ రహదారి విస్తరణ కలగానే మిగిలింది. గత ప్రభుత్వ హయాంలోనే ఇబ్రహీంపట్నం సెయింట్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి మాల్ వరకు 25 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు విస్తరణకు సర్వే పూర్తి చేశారు. ప్రస్తుత సర్కార్ ఏర్పాటైన తర్వాత సైతం హెచ్‌ఎండీఏ, రోడ్డు భవనాల, పోలీస్ శాఖ సంయుక్తంగా సర్వే చేసి స్థానికుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కానీ ఇంతవరకు రోడ్డు విస్తరణ కొలిక్కి రావడం లేదు. ప్రమాదాల నివారణ కోసం యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం పోలీసులు రోడ్డుపై తరచూ వాహనాల తనిఖీలు చేపట్టి ప్రయాణికులు, డ్రైవర్లకు సూచనలు చేస్తున్నా ఫలితం శూన్యం. సాగర్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చి, డివైడర్ ఏర్పాటు చేస్తే తప్పా ప్రమాదాల నివారణ సాధ్యమయ్యే అవకాశం కనిపించడం లేదు.

కారులో వెళ్లాలంటే..



కారులో కుటుంబ సభ్యులతో కలిసి నగరం నుంచి మా గ్రామానికి వెళ్లాలంటే భయమేస్తోంది. మనం జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తున్నా ఎదురుగా వచ్చే వాహనదారుడు నిర్లక్ష్యంగా వస్తే ప్రమాదమే. సాగర్ రహదారిపై గతేడాది వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది.

– రవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మొండిగౌరెల్లి

ఆర్టీసీ బస్సులతో ముప్పు



సాగర్ రహదారిపై రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు మితిమీరిన వేగంతో నడుపుతున్నారు. దీంతో ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఆర్టీసీ అధికారులు ఏం చర్యలు తీసుకుంటున్నారో అర్థం కావడం లేదు.

– రవీందర్‌గుప్తా, స్వచ్ఛంద కార్యకర్త, నక్కర్తమేడిపల్లి

జరిమానాలు వేస్తున్నాం



సాగర్ రహదారిపై తరచూ వాహనాల తనిఖీలు చేపట్టి అతి వేగంగా వెళ్తున్న వాహనాదారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నాం. జాగ్రత్తగా ప్రయాణించాలని సూచిస్తున్నాం. వాహనాల ఆర్‌సీ, లైసెన్స్‌లు చెక్ చేసి, నిబంధనలకు విరుద్ధంగా నడిపే వారికి జరిమానాలు వేస్తున్నాం.

– నర్సింహారావు, సీఐ, యాచారం

చికిత్స పొందుతూ.. జీపీ కార్మికుడి మృతి


యాదయ్య (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని వెల్‌జర్లకు చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాదయ్య(50) పదిహేను ఏళ్లుగా గ్రామ పంచాయతీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే మూడు నెలల క్రితం తాగునీటిని సరఫరా చేసేందుకు వాల్వ్‌ను విడిచేందుకు ఆయన వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వాల్వ్ కాలుపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఆయన్ని గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యాదయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్‌లు డిమాండ్ చేశారు.

ప్రొద్దటూరులో విషాదం

- మధ్యప్రదేశ్ రోడ్డు ప్రమాద ఘటనలో శంకర్‌పల్లి వాసి మృతి
- ప్రయాగ్‌రాజ్ నుంచి తిరిగి వస్తుండగా ఘటన


మల్లారెడ్డి (ఫైల్)

శంకర్‌పల్లి: ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకి తిరిగి వస్తుండగా మంగళవారం ఉదయం మధ్యప్రదేశ్ జబల్‌పూర్‌లోని సిహోరా ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపైకి వ్యతిరేక దిశలో అజాగ్రత్తగా వస్తున్న ఓ లారీని హైదరాబాద్ ప్రాంతానికి చెందిన మినీ బస్సు బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో మొత్తం 8మంది మృత్యువాత పడినట్లు పోలీసులు గుర్తించారు. మృతులంతా హైదరాబాద్‌లోని నాచారం వాసులుగా నిర్ధారించారు. అయితే ఈ 8 మందిలో సురకంటి మల్లారెడ్డి(62) అనే వ్యక్తి స్వస్థలం శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరు. కొన్నేళ్ల క్రితం భార్య, తల్లి, కొడుకుతో కలిసి హైదరాబాద్ నాచారం వెళ్లి పాల వ్యాపారం చేస్తూ, అక్కడే స్థిరపడిపోయారు. బంధుమిత్రుల శుభకార్యాలకు, జాతర్లకు ప్రొద్దటూరుకు వచ్చి, ఇక్కడ ఇంట్లో కొన్ని రోజులు ఉండి వెళ్తుంటారు. వారికి గ్రామంలో పొలం సైతం ఉందని, వారి తండ్రి ప్రభాకర్‌రెడ్డి సుమారు 10ఏళ్ల పాటు సర్పంచిగా సేవలందించినట్లు గ్రామస్తులు తెలిపారు. మల్లారెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య


షేక్‌గౌస్ పాష(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మున్సిపల్ పరిధి సోలీపూర్ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని భాగ్యనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న షేక్‌గౌస్ పాష(47) సీడ్స్ డిస్ట్రిబ్యూటర్‌గా పని చేస్తున్నాడు. పాష తన ద్విచక్ర వాహనంపై సోలీపూర్ సమీపంలోని రైల్వేట్రాక్ వద్దకు చేరుకున్నాడు. సెల్‌ఫోన్‌ను ట్రాక్ పక్కనపెట్టి ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలపై పడుకున్నాడు. గుర్తు తెలియని రైలు అతడి పై నుంచి వెళ్లడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్‌మెన్ పరమేశ్వర్.. ప్రమాదం గురించి స్టేషన్ మాస్టర్ రాహుల్‌కు సమాచారం అందించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. రాహుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పాష ఆత్మహత్యకు కారణాలు తెలియ రాలేదు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన ఫొటోగ్రాఫర్

పోలీసులకు ఫిర్యాదు చేసిన అతడి భార్య


ప్రహ్లాద్ (ఫైల్)

మొయినాబాద్: ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాల ప్రహ్లాద్(38) ఫొటో గ్రాఫర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం అతడి భార్య మంగమ్మకు తాను ఫొటో ఆల్బమ్ కోసం లంగర్‌హౌస్‌కు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. రాత్రి అయిన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ప్రహ్లాద్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో ఆమె తెలిసిన వారిని విచారించింది. ఎక్కడ ఆచూకీ లభించకపోవటంతో మంగళవారం ఉదయం మంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంతకు ముందే ప్రహ్లాద్ తన ఫోన్‌కు వాయిస్ మెసేజ్ రూపంలో ‘తాను రెండు సంవత్సరాల తరువాత వస్తానని.. తన ప్లాట్ అమ్మి అప్పులు చెల్లించాలి.’ అని వచ్చిందని పోలీసులకు ఫిర్యాదులో తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్లకు రూ.3 కోట్లు

దౌల్తాబాద్: మండల పరిధి గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. అయితే వీటిని మార్చి 31 వరకు ఖర్చు చేయాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో పనులు పూర్తి చేయడం అనుమానంగానే కనిపిస్తుంది. పనులు సకాలంలో పూర్తికాకపోతే నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉందని, పనులు పూర్తి చేయించాలని అధికారులపై స్థానిక నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పనులు పూర్తి చేయనట్లయితే నిధులను మళ్లీ ఖర్చు చేయడానికి వీలు ఉండదు. దీంతో ఇప్పటి నుంచే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు. మండలానికి మంజూరైన 60 సీసీరోడ్లు వివిధ కాలనీల్లో నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నారు. పనులు పూర్తయితే రోడ్లు బాగుపడతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పలువురికి స్వల్ప గాయాలు

నందిగామ: కారు, బస్సు ఢీకొన్న ఘటనలో పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు.. మంగళవారం హైదరాబాద్ నుంచి షాద్‌నగర్‌కు పాత జాతీయ రహదారిపై వెళ్తోంది. ఈ క్రమంలో నందిగామ శివారు నూజివీడు పరిశ్రమ సమీపంలో డివైడర్‌లోని మొక్కలకు నీరు పోస్తున్న ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్యాంకర్ డివైడర్ పైకి ఎక్కింది. వెంటనే తేరుకున్న డ్రైవర్.. బస్సును ఎడమవైపునకు మళ్లించాడు. అదే సమయంలో ఎడమవైపు నుంచి వెనకాల వెళ్తున్న ఇన్నోవ కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా, అందులో ప్రయాణిస్తున్న వారికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. బస్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కారు డ్రైవర్ మహావీర్ కోరారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్తీ అల్లం వెల్లుల్లి గుట్టురట్టు


అపరిశుభ్రమైన వాతావరణంలో అల్లం వెల్లుల్లి కేంద్రం

పహాడీషరీఫ్: అపరిశుభ్రమైన వాతావరణంలో కల్తీ అల్లం వెల్లుల్లి మిశ్రమాన్ని తయారు చేస్తున్న కేంద్రంపై మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్‌కు చెందిన మహ్మద్ సమీర్(44), మహ్మద్ అమీరుద్దీన్(55)లు గత కొన్ని రోజులుగా ఎర్రకుంట ప్రాంతంలో న్యూ గోల్డెన్ తయారీ యూనిట్ పేరుతో అల్లం వెల్లుల్లి మిశ్రమాన్ని తయారు చేస్తున్నారు. కనీస శుచి శుభ్రత లేకుండా కల్తీమయమైన అల్లం వెల్లుల్లిని తయారు చేస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్‌వోటీ, బాలాపూర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మహ్మద్ సమీర్‌ను అరెస్ట్ చేయడంతో పాటు కేంద్రంలో మొత్తం 3250 కిలోల అల్లం వెల్లుల్లి ముడి సరుకును స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నాం


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

తాండూరు టౌన్: చిలుకూరు బాలాజీ దేవస్థాన ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నట్లు పలు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. రామరాజ్యం పేరుతో అర్చకుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఇందుకు ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లౌకికవాది, ప్రజాస్వామ్యవాదైన రంగరాజన్‌పై రౌడీమూకలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు చంద్రయ్య, గోపాలకృష్ణ, శేఖర్ తదితరులు తెలిపారు.

మార్కెట్ అభివృద్ధికి సమష్టి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

నవాబుపేట: మార్కెట్ అభివృద్ధికి ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో ముందుకెళ్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ గీతాసింగ్‌నాయక్, వైస్ చైర్మన్ బల్వంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం నూతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో త్వరలోనే మార్కెట్‌ను పునరుద్ధరిస్తామన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయానికి స్థల సేకరణ, నిధులు కేటాయింపు జరిగిందన్నారు. 20 ఏళ్ల క్రితం మండల కేంద్రంలో అన్ని రకాలుగా నవాబుపేటలో సంత జరిగేదన్నారు. పూర్వ వైభవానికి కృషి చేస్తున్నామన్నారు. డైరెక్టర్లు నర్సింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఖదీర్, లింగం, బలరాం, మహేందర్‌రెడ్డి, వెంకటేశం, అంజయ్య పాల్గొన్నారు.

సోఫా రిపేర్ షాపులో అగ్ని ప్రమాదం


మంటల్లో కాలిపోతున్న సోఫా మరమ్మతు దుకాణం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం

తాండూరు టౌన్: సోఫా రిపేర్‌లో అగ్ని ప్రమాదం సంభవించి పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.4 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. ఈఘటన మంగళవారం తాండూరు పట్టణం మల్‌రెడ్డిపల్లి రోడ్డు మార్గంలోని తానియా సోఫా రిపేర్ అండ్ రెగ్జిన్ వర్క్స్ షాపులో చోటుచేసుకుంది. ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి తెలిపిన వివరాల ప్రకారం.. సోఫా రిపేర్ షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్లు వచ్చిన సమాచారంతో ఫైరింజన్‌తో ఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుంది. 20 నిమిషాల వ్యవధిలో చూస్తుండగానే మంటలు షాపును పూర్తిగా దగ్ధం చేశాయి. రెగ్జిన్ ఎక్కువగా ఉండటంతో మంటలు ఉవ్వెత్తున లేచాయి. దీంతో ఫైర్ ఇంజన్ రెండోసారి నీటితో మంటలను అదుపులోకి తీసుకు రావాల్సి వచ్చింది. సుమారు రూ.4లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఫైర్‌సిబ్బంది అంచనా వేశారు. పక్కనే ఓ ప్రైవేటు స్కూల్ ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్కూల్ యాజమాన్యం విద్యార్థులను వెంటనే అక్కడి నుంచి తరలించారు. షాపు యజమాని చెత్త చెదారాన్ని తగలబెట్టడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తుండగా, షార్ట్ సర్క్యూట్‌తోనే జరిగినట్లు షాపు యజమాని చెబుతున్నారు. అయితే అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఆలస్యంగా ఘటనా స్థలానికి చేరుకున్నారని స్థానికులు ఆరోపించారు. అలాంటిదేమీ లేదని, మంటలు పెద్ద ఎత్తున విస్తరించిన తర్వాత సమాచారం ఇచ్చారని, అప్పటికే షాపు పూర్తిగా దగ్ధం కాగా, ఫైరింజన్‌తో రెండుసార్లు నీళ్లు చల్లి మంటలను అదుపులోకి తెచ్చినట్లు ఫైర్ సిబ్బంది చెప్పారు.

కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్య

చేవెళ్ల: కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని శ్రీరామ అగ్రికల్చర్ పౌల్ట్రీఫామ్‌లో వికారాబాద్ జిల్లాకు చెందిన బాబు, అతని భార్య అనిత(26)లు ఏడాది కాలంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం దంపతులు గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన అనిత వేరే గదిలో పడుకుంది. అర్ధరాత్రి ఫ్యాన్‌కు అనిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం నిద్ర లేచిన భర్త బాబు.. భార్య ఇంకా లేవలేదని గదిలోకి వెళ్లి చూడగా.. ఫ్యాన్‌కు వేళాడుతూ కనిపించింది. స్థానికుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్


పోలీసులకు చిక్కిన నిందితుడు

పహాడీషరీఫ్: గంజాయి సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని మహేశ్వరం ఎస్‌వోటీ, బాలాపూర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 110 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి న్యూ బాబానగర్‌కు చెందిన మహ్మద్ జావెద్(50) వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. వచ్చే వేతనం చాలక సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో అవసరమైన వారికి గంజాయి సరఫరా చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే చిన్న చిన్న ప్యాకెట్లలో గంజాయిని ప్యాక్ చేసి విక్రయించేందుకు యత్నిస్తుండగా షాహీన్‌నగర్‌లో ఎస్‌వోటీ, బాలాపూర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి అరెస్ట్ చేశారు. ఇతను ఇప్పటి వరకు తొమ్మిది గంజాయి సరఫరా కేసులలో నిందితుడిగా ఉన్నాడు. ఇతనికి సహకరిస్తున్న మరో వ్యక్తి షోయబ్ నవాబ్ పరారీలో ఉన్నాడు.